ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 1 అక్టోబరు 2024



సావనీర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, కామినేని, వీసీ గంగాధరరావు తదితరులు

ఆరోగ్యవంతమైన దేశం.. ఆరోగ్యకర సమాజం.. వ్యాక్సినేషన్‌తోనే సాధ్యం. భావిభారత పౌరులైన నేటి చిన్నారులతోనే ఆరోగ్యవంతమైన దేశం సాధ్యమవుతుంది. అలాంటి చిన్నారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయి. వీటిలో ప్రధానమైనది వ్యాక్సినేషన్.. టీకాలు. ఈ వ్యాక్సినేషన్‌తో ఎన్నో వ్యాధులు, జబ్బులు అంతమైపోయాయి. అయితే మళ్లీ కొన్నేళ్లుగా కోరింత దగ్గు, మీజిల్స్(తట్టు, పొంగు, చర్మం మీద దద్దుర్లు), గవద బిళ్లలు ఇటీవల పుట్టే పిల్లల్లో కనిపిస్తున్నాయి. వ్యాక్సినేషన్ పక్కాగా జరగకపోవడం వల్లే ఈ వ్యాధులు మళ్లీ కనిపిస్తున్నట్లు వైద్యఆరోగ్యశాఖ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. పని చేయని టీకాల కారణంగానే ఆయా జబ్బులతో పిల్లలు అస్వస్థతకు గురవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో టీకాల ప్రక్రియ పక్కాగా జరిగేదని అందువల్లే పలు జబ్బులు ఉనికిలో లేకుండా పోయాయని అయితే కొన్నేళ్లుగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం.. లోపాలతో టీకాలో పొటెన్సీ తగ్గిపోతుందని.. అందువల్లే టీకాలు పనిచేయడంలేదని.. ఈ కారణంగానే అంతమైపోయాయనుకుంటున్న జబ్బులు, వ్యాధులు తరచుగా కనిపిస్తున్నాయని అర్థమవుతుంది.



క్షేత్రస్థాయి సిబ్బంది వ్యాక్సిన్ తీసుకెళ్లేందుకు వినియోగించే క్యారియర్



వ్యాక్సిన్ క్యారియర్‌లోని ఐస్ ప్యాక్‌లు

- పిల్లల్లో పనిచేయని వ్యాక్సిన్లు
- తెగిపోతున్న కోల్డ్ చైన్‌తో టీకాలు నిర్వీర్యం
- వెలుగుచూస్తున్న కోరింతదగ్గు, మీజిల్స్, గవద బిళ్లల కేసులు
- సచివాలయ వ్యవస్థ వచ్చాక వ్యాక్సినేషన్ సమయం తారుమారు
- ఎక్కువ సేపు బయట ఉండటంతో వ్యాక్సిన్ సామర్థ్యం మాయం



పసలేని టీకా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30: ఈ మధ్య కాలంలో పుట్టిన పిల్లల్లో ఎక్కువగా కోరింత దగ్గు, మీజిల్స్(తట్టు, పొంగు, చర్మం మీద దద్దుర్లు), గవద బిళ్లలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది ఇటువంటి కేసులు ఎక్కువగా వెలుగులోకి వచ్చాయి. గత ఐదారేళ్ల వరకు ఈ కేసుల ఉనికి లేదు. ఇప్పుడు తరచుగా ఆ కేసులు కనపడుతున్నాయి. ప్రస్తుతం జన్మిస్తున్న పిల్లల్లో ఈ రోగాల జాడ కనపడటానికి వీలు లేదు. ఎందుకంటే బిడ్డ పుట్టీపుట్టక ముందే వాక్సినేషన్ ప్రక్రియ ఆరంభమవుతుంది. బిడ్డ పుట్టగానే జీరో పోలియో, జీరో హెపటైటిస్-బీ టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసే ప్రయత్నం ప్రారంభం అవుతుంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అయినా ఆయా రోగాలు ప్రస్తుతం పిల్లల్లో కనపడుతున్నాయంటే ఎక్కడో లెక్క తప్పుతున్నట్టు అర్థం అవుతుంది. పుట్టిన పిల్లలకు ఐదేళ్లు వచ్చే వరకు అవసరమైన అన్ని వ్యాక్సిన్లను వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులోకి తెచ్చింది. బీసీజీ, ఓపీవీ, ఐపీవీ, ఆర్‌వీవీ, డీపీటీ, మీజిల్స్ రూబెల్లా, హెపటైటిస్ బీ, పెంటా వ్యాలెంట్, విటమిన్- ఏ వ్యాక్సిన్లు ఉచితంగా వేస్తున్నారు. ఈ వ్యాక్సిన్లన్నీ ఐఎల్‌ఆర్(టీకాలు నిల్వ ఉంచే ఫ్రిజ్‌లు)లో +2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నుంచి +8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో భద్రపరుస్తారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో వినియోగించే ఐస్ ప్యాక్‌లను డీప్ ఫ్రిజ్‌లో ఉంచుతారు. అందులోనే ఓరల్ పోలియో వ్యాక్సిన్ కూడా ఉంచుతున్నారు. 15 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య డీప్ ఫ్రిజ్ ఉష్ణోగ్రతను ఉంచాలి.

కోల్డ్ చైన్ కీలకం

ప్రభుత్వం గ్రామ స్థాయికి సరఫరా చేస్తున్న వ్యాక్సిన్ తగిన సామర్థ్యం(పొటెన్సీ) ఫలప్రదమైందిగా ఉండాలంటే కోల్డ్ చైన్ నిర్వహణ ముఖ్యమైనది. జిల్లా కేంద్రం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు జాగ్రత్తలతో వ్యాక్సిన్‌ను సరఫరా చేయాలి. లెక్కకు మించిన సంఖ్యలో సెషన్స్(టీకాలు వేసే కార్యక్రమం) నిర్వహించాలన్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల ఆలోచన పెనుశాపంగా పరిణమిస్తోంది. గతంలో ఒక్కో ఆరోగ్య ఉపకేంద్రంలో కేవలం రెండు, మూడు సెషన్స్ మాత్రమే జరిగేవి. ఇప్పుడు నెలకు ఖచ్చితంగా ఎనిమిది సెషన్స్ జరగాలని అధికారులు చెబుతున్నారు. దాని వల్ల డోసులు ఉన్నా లేకపోయినా క్షేత్రస్థాయి సిబ్బంది వ్యాక్సిన్ క్యారియర్ తీసుకువెళ్తున్నారు. సచివాలయాల ఏఎన్ఎంల్లో చాలామందికి వ్యాక్సిన్ ప్రక్రియపై సరైన అవగాహన లేకుండానే టీకాలు వేస్తున్నారు. ఫీల్డ్ వర్క్‌తో సంబంధం లేకుండా, సరైన శిక్షణ లేకుండానే ఏఎన్ఎంలతో టీకాలు వేయిస్తున్నారు. గతంలో ఏఎన్ఎంలు ప్రతి బుధ, శనివారం ఉదయం 7 గంటలకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని వ్యాక్సిన్ తీసుకువెళ్లే వారు. ఇప్పుడు ఆ పద్ధతి లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో చోట ఒక్కో సమయానికి వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. ఉదయం 10 తర్వాత కూడా కొందరు ఏఎన్ఎంలు వ్యాక్సిన్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వ్యాక్సిన్ పొటెన్సీ పూర్తిగా దెబ్బ తింటుంది. ఒక్కో క్యారియర్‌లో నాలుగు ఐస్ ప్యాక్‌లు ఉంచుతున్నా.. ఒక్కోటి కొద్దీ నిమిషాలు మాత్రమే కరిగి పోకుండా ఉంటుంది. ఉదయం 9 నుంచి 10 గంటల సమయంలో వ్యాక్సిన్ తీసుకుంటున్న ఏఎన్ఎంలు కొందరు మధ్యాహ్నం 2 తర్వాత, మరి కొందరు సాయంత్రం 4 గంటల తర్వాత తిరిగి తీసుకు వస్తున్నారు. ఈ మధ్య సమయంలో వ్యాక్సిన్ సరైన కోల్డ్ చైన్ లేక నిర్వీర్యమవుతుంది. అటువంటి టీకాలు వేయడం వల్లే పిల్లలకు కోరింత దగ్గు, మీజిల్స్, గవద బిళ్లలు వస్తున్నాయని వైద్య వర్గాల సమాచారం.

మార్పు దిశగా విద్యా విధానం

- జీవితపు చైతన్యంలో ముందున్న భారత్
- తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన సచ్చిదానందమూర్తి
- వర్సిటీలో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి
- మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు

పెదకాకాని, సెప్టెంబరు 30: దేశంలో మన విద్యా విధానం సమూలంగా మార్చుకోవాలని.. నూతన విద్యా విధానం ఈ దిశగా కృషి చేస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. భారతీయ తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి సందర్భంగా నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో-ఏషియన్ ఫిలాసఫీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణంలో తొలుత కొత్త సచ్చిదానందమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇప్పటి వరకు ముద్రితం కాని ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలను 'ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ది ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్' పేరుతో ప్రొఫెసర్ అశోక్‌వోహ్రా, కె.రమేష్ సంపాదకత్వంలో తీసుకువచ్చిన పుస్తకాన్ని, ఆయన స్మృతి చిహ్నంగా తీసుకువచ్చిన పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జీవ చైతన్యం, జీవితపు చైతన్యం విషయంలో భారత ఉపఖండం కొన్ని వేల సంవత్సరాలుగా మిగిలిన ప్రపంచం కన్నా ముందు ఉందన్నారు. 20వ శతాబ్దంలో జిడ్డు కృష్ణమూర్తి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన గొప్ప జ్ఞాని కొత్త సచ్చిదానందమూర్తి అని తెలిపారు. జ్ఞాన సముపార్జనలో, దాన్ని పది మందితో పంచుకోవడంలో వారు చూపిన తపన నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన సచ్చిదానందమూర్తి ప్రపంచ స్థాయికి ఎదగడం వెనుక ఆయన స్వయంకృషి ఎంతో ఉందన్నారు. సచ్చిదానందమూర్తి భారతీయ తత్వాన్ని అణువణువునా జీర్ణించుకుని ఆచరించి చూపిన ఆధునిక మనిషి అని అన్నారు. మనకున్న సంపదను, విజ్ఞానాన్ని పదిమందితో పంచుకోవాలని భారతీయ సనాతన ధర్మం బోధిస్తోందన్నారు. పంచుకుంటే పెరుగుతుందే కానీ తగ్గదనే సనాతన ధర్మాన్ని అణువణువున నింపుకుని ఆయన ఆచరించి చూపించారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సచ్చిదానందమూర్తి పేరిట తత్వశాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నేటితరం విద్యార్థులు సచ్చిదానందమూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కులమతాలతోపాటు యుద్ధాలు లేని సమాజాలు, దేశాలు, ఉన్నప్పుడు మానవాళి సుఖశాంతులతో ఉంటుందన్నారు. తన తండ్రి మండలి వెంకటకృష్ణరావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సచ్చిదానందమూర్తిని వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి వీసీగా నియమించారని గుర్తు చేశారు. వైష్ణవ ప్రార్థనలకే పరిమితమైన విశ్వవిద్యాలయంలో అన్ని మత ప్రార్థనలకు అవకాశం ఇచ్చిన లౌకికవాదిగా నిలిచారన్నారు. యూజీసీ ఉపాధ్యక్షుడిగా సచ్చిదానందమూర్తి పనిచేసిన సమయంలో ఎంఫిల్, పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసాలను ప్రాంతీయ భాషల్లోనూ సమర్పించే అవకాశం కల్పించారన్నారు. సచ్చిదానందమూర్తి సెంటర్‌ను బలోపేతం చేసి, ఆయన అడుగుజాడల్లో విశ్వవిద్యాలయాన్ని ముందుకు నడిపించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని వీసీ ఆచార్య కే.గంగాధరరావు తెలిపారు. ప్రొఫెసర్ అశోక్‌వోహ్రా మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయి ఫిలాసఫీ విభాగాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన, పరిశోధన అందుబాటులోకి తేవాలన్నారు. ఫిలాసఫీ అవసరాన్ని గుర్తించ బట్టే నేడు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు సైతం విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అక్కడి విద్యార్థులకు ఫిలాసఫీ బోధిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, సదస్సు కన్వీనర్ ఎం.త్రిమూర్తిరావు, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.స్వరూపారాణి, ప్రొఫెసర్ ఎన్వీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- గతంలోని ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోము
- త్వరలో కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక
- నోటిఫికేషన్ జారీ చేసి ఆదేశాలు ఇచ్చిన కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికకు ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న వారందరిని ఓటర్లుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఏఈఆర్‌వోలకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలోని డీఆర్‌వో, ఆర్‌డీవో, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీ కాలం 2025 మార్చి 29తో ముగుస్తున్నందున ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా రూపొందించడానికి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సెప్టెంబరు 30 నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సీ ఓటర్ల జాబితాకు సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో మరోసారి పబ్లిక్ నోటీసు జారీ చేస్తామన్నారు. ఓటరుగా నమోదుకు నవంబరు 6 వరకు దరఖాస్తులు స్వీకరించి, అదే నెల 20న ముసాయిదా ఓటరు జాబితా ముద్రించి 23న ప్రచురిస్తామన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి 25కి పరిష్కరించి తుది ఓటరు జాబితా డిసెంబరు 30న ప్రచురిస్తామన్నారు. గతంలోని ఓటరు జాబితాను పరిగణలోకి తీసుకోరని, అందువల్ల ప్రతి ఒక్కరు నూతనంగా ఓటు కోసం ఖచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా గుంటూరు డీఆర్వో ఉంటారని, అసిస్టెంట్ ఎలక్ట్రోల్ అధికారిగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలోని సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు ఉంటారన్నారు. వీరితో పాటు పట్టభద్రుల ఓటు నమోదుకు సంబంధించి దరఖాస్తుదారుల డిగ్రీ సర్టిఫికెట్లను అటెస్టేషన్ చేయడానికి డిజిగ్నేటెడ్ అధికారులుగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులుగా ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఈవోపీఆర్డీలు, పోస్ట్‌మాస్టర్లు, గజిటెడ్ అధికారులను గుర్తించామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు ఓటరుగా నమోదుకి నవంబరు 1కి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ప్రస్తుత గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని పూర్తి మండలాలు, బాపట్ల, ఏలూరులో నిర్దేశించిన కొన్ని మండలాలలో సాధారణ నివాసి అయి ఉండి దేశంలో ఎక్కడైన గ్రాడుయేషన్ పూర్తి చేసిన వారు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు డీఆర్‌వో పెద్ది రోజా, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.





అమరావతిలో.. టెక్నాలజీ సెంటర్

- సీఆర్‌డీఏకి కేంద్రం రూ.250 కోట్ల ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టు మంజూరు
- గతంలో కడప జిల్లా కొప్పర్తికి.. పురోగతి లేకపోవడంతో రాజధానికి తరలింపు
- భూమిని ఇచ్చే బాధ్యత సీఆర్‌డీఏ కమిషనర్‌కి కేటాయించిన ప్రభుత్వం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి పారిశ్రామికంగా ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అమరావతి కేంద్రంగా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా(ఎంఎస్‌ఎంఈ) సాంకేతిక పరిశ్రమల ఏర్పాటు కానున్నాయి. రూ.250 కోట్ల పెట్టుబడితో రాజధానిలో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆ మేరకు సీఆర్‌డీఏ పరిధిలో ఎక్కడైనా 20 ఎకరాల భూమిని ఉచితంగానే కేంద్ర ప్రభుత్వానికి కేటాయించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతని సీఆర్‌డీఏ కమిషనర్‌కు అప్పగించింది. 2019లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు తొలుత ఈ సెంటర్‌ని గుంటూరు జిల్లాకు కేటాయించింది. అయితే ఎక్కడైతే సెంటర్ ఏర్పాటు చేద్దామని భావించారో ఆ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకానికి ఇచ్చేసింది. దాంతో 2022లో ఈ ప్రతిష్ఠాత్మకమైన సెంటర్‌ని కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు తరలించాలని నిర్ణయించారు. అయితే 2023లో కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటును తిరస్కరించింది. గతంలో మంజూరు చేసిన గుంటూరులోనే ఏర్పాటు చేయాలని తాజాగా ఆదేశించింది. రాష్ట్ర రాజధాని అమరావతిలో నవ నగరాలను నిర్మించాలని టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యనే నిర్ణయించింది. అందుకు అవసరమైన బృహత్తర ప్రణాళికని కూడా ఆమోదించింది. ఇండస్ట్రియల్ సిటీని నిర్మించేందుకు అప్పట్లో ఏర్పాట్లు కూడా జరిగాయి. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులను అక్కడే నిలిపేసింది. దాంతో నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులు ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర నష్టం జరిగింది. ఈ ఏడాది జూన్‌లో టీడీపీ నేతృత్వ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధానికి పూర్వ వైభవం సంతరించుకోవడం మొదలైంది. జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా రూ.250 కోట్లతో కేంద్ర ప్రభుత్వం నిర్మించే ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం అమరావతికి మంచి బూస్టప్ ఇస్తుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. ఏపీసీఆర్‌డీఏ వద్ద భూమి పుష్కలంగా అందుబాటులో ఉన్నందున కొద్ది రోజుల్లోనే ఈ స్థలాన్ని కేంద్రానికి స్వాధీనం చేయనున్నారు. ఈ సంస్థ ఏర్పాటైతే అందుకు అనుబంధంగా అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నిర్మాణం జరుగుతాయి. దాంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయి. అలానే పారిశ్రామికంగా అమరావతి నగరం అభివృద్ధి చెందడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగప డుతుందని రాష్ట్ర ప్రభు త్వం పేర్కొంటు న్నది.



ఉద్యానానికి.. ఊతం

- సాగుకు రాయితీలు ప్రకటించిన ప్రభుత్వం
- ప్రోత్సాహకాలు, బకాయిల క్లియరెన్స్‌పై కూడా దృష్టి
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఉద్యాన సాగు
- గత వైభవం దిశగా అడుగులేస్తున్న కూటమి ప్రభుత్వం



బాపట్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉద్యాన రైతు ఉసూరుమన్నాడు. ప్రోత్సాహకాలు అందక ఏటికేడు ఉద్యాన సాగు కుచించుకుపోతూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వజూపిన వాటిని అందిపుచ్చుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రోత్సాహకాలు అందక.. బకాయిలు చెల్లింపులు జరగక ఉద్యాన రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అంపశయ్యమీద ఉన్న ఉద్యాన పంటల సాగుకు ఊపిరిలూదే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉన్న రాయితీ బకాయిలను విడుదల చేసింది. అంతేకాకుండా ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పంటి పథకాల కింద అందించే ప్రోత్సాహకాలను సైతం ప్రభుత్వం వెల్లడించి రైతుల్లో ఆశలు చిగురించేలా చేసింది. 2014-19 మధ్య ఉద్యాన పంటల సాగుకు దాదాపు స్వర్ణయుగమే. వైసీపీ రావడంతోనే ఉద్యాన సాగుకు తిరోగమనం మొదలైంది. ఉద్యానసిరులు కురిపించాల్సిన పంటల సాగు కాస్తా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఉద్యాన పంటలసాగుకు గత వైభవం కల్పించేలా అడుగులు వేస్తోంది. ఉద్యాన పంటల ప్రోత్సాహం కింద రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు రూ.7.50 కోట్ల వరకు, పల్నాడు జిల్లాలో రూ.5.50 కోట్ల వరకు అందించనుంది. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యాన బకాయిలపై కూడా కదలిక వచ్చింది. త్వరలోనే వీటిని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2014-19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేవి. ఇది కాస్తా ఏటికేడు కుచించుకుపోతూ 1.20 లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఉద్యాన పంటలకు సంబంధించి రైతులకు ఐదేళ్లలో బకాయిలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే రూ.25 కోట్లకు పైనే ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిల చెల్లింపు విషయంలో గతేడాది మాత్రమే అరకొరగా చెల్లింపులు జరిపి ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం వైసీపీ చేసింది.

రైతులు సమాయత్తం..

కూటమి ప్రభుత్వంలో ఉద్యాన పంటల సాగుకు గత వైభవం సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటికే ప్రోత్సాహకాలను ప్రకటించిన ప్రభుత్వం బకాయిల చెల్లింపులపై కూడా దృష్టి సారించింది. దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున ఉద్యాన సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. క్షేత్రస్థాయి అంచనాలను బట్టి ఈఏడాది ఒక్క బాపట్ల జిల్లాలోనే 60,000 ఎకరాల్లోనే సాగవనుందనే అంచనాలున్నాయి. మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటి వాటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముంది. టీడీపీ ప్రభుత్వంలో ఉద్యాన సాగుకు సంబంధించి ఎకరాకు రూ.5,000 వరకు ప్రోత్సాహకం ఉండేది.

పెట్టుబడి ఎక్కువ..

సంప్రదాయ పంటలసాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. కానీ ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తే అన్నదాతలకు సిరుల పంట పండే అవకాశం ఉంటుంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాల వల్ల ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ మంది ఉద్యాన పంటల సాగు బాట పట్టారు. కానీ గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల సాగు జిల్లాలో తిరోగమనబాట పట్టడమే కాకుండా సాగు చేసిన రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారు. విపత్తులవల్ల నష్టం సంభవించినప్పుడు అందించే సాయం విషయంలో గత ప్రభుత్వం నివేదికలకు పరిమితం చేసింది తప్ప రైతులకు ఊరట దక్కలేదు. దీంతో ఉద్యాన పంటలు సాగు చేసే రైతుల్లో 50 శాతం మంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వీరందరికీ మళ్లీ ఉద్యాన సాగు విషయంలో రాయితీలను విరివిగా అందించి అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.



ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చూరియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చూరియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ: ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష



రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.

- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024 x 768 కంటే తక్కువ కాకుండా స్క్రీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

దిక్సూచి DIKSUCHI

ఎన్టీఆర్ వర్సిటీ మెడికల్ పీజీ నోటిఫికేషన్

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో; స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్), శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. పీజీ డిగ్రీ వ్యవధి మూడేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి రెండేళ్లు.

అర్హత: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. నీట్ పీజీ 2024 ఎగ్జామ్‌లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 పర్సంటైల్; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 పర్సంటైల్ మార్కులు ఉండాలి. మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు రూ.7080; ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారికి రూ.10,620; విదేశాల్లో చదివినవారికి రూ.15,340
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్: సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్: ఇందులో 210 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్-బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్ ● ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్. ● హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)


అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఎ ఉత్తీర్ణులు; ఎంసీఏ/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి.

- **చివరి తేదీ:** అక్టోబరు 14
- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/

నవ్య చిత్రజ్యోతి

బెంగాల్ టైగర్‌కు ఫాల్కే పురస్కారం






బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరొందిన నటుడు మిథున్ చక్రవర్తికి 2022 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ ఇస్తున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆశా పరేఖ్, కుష్బూ, విపుల్ అమృత్‌లాల్ షా సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ ఈ అవార్డ్‌కు మిథున్ పేరుని ఎన్నిక చేసిందని మంత్రి వెల్లడించారు. దేశంలోని అత్యున్నత పురస్కారాల్లో మూడోది అయిన పద్మభూషణ్ పొందిన ఆరు నెలల కాలంలో భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ వరించడంతో బెంగాలీబాబు మిథున్ చక్రవర్తి నట జీవితానికి ఓ సార్థకత లభించిందని చెప్పాలి. మిగతా హీరోల్లా ఆయన కెరీర్ మొదటి నుంచీ అంత సాఫీగా సాగలేదు. ప్రతి దశలోనూ పోరాటమే. విద్యార్థి దశలోనే కాదు చిత్ర పరిశ్రమలోనూ ఆయనది పోరుబాటే. పోరాడి అన్నీ సాధించుకున్నారు మిథున్. అయితే ఆయన అసలు పేరు అది కాదు.. గౌరంగ చక్రవర్తి. 1950 జూన్ 16న కోల్‌కతాలో పుట్టిన గౌరంగ బి.ఎస్సీ చదివారు. వామపక్ష భావజాలం కలిగి ఉండడంతో సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న దోపిడి చూసి తట్టుకోలేకపోయేవారు. నక్సలిజం ఉద్యమం పట్ల ఆకర్షితుడై సోదరుడితో కలసి అందులో చేరి ఉద్యమకారుడిగా పీడిత ప్రజల్ని ఆకట్టుకున్నారు. అయితే తన సోదరుడు మరణించిన తర్వాత ఉద్యమ బాట వదిలి జనంలోకి వచ్చారు. బెంగాల్‌లో ఇక ఉండలేక ముంబైకి వెళ్లిపోయారు. మొదట్లో సినిమాల మీద ఆసక్తి ఉండేది కాదు. బతకడం కోసం ఏదన్నా ఉద్యోగం చేయాలనుకుని ఓ నైట్ క్లబ్‌లో డాన్సర్‌గా చేరారు. ఆ క్లబ్‌కు వచ్చిన సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించారు. బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ 'మృగయా'(1976) చిత్రంలో మిథున్‌కు అవకాశం ఇచ్చారు. అవార్డ్ వచ్చిన సందర్భంగా మిథున్ తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. 'ముంబైకి వచ్చిన తొలి రోజుల్లో తినడానికి తిండి దొరికేది కాదు. గార్డెన్‌లో పడుకున్న రోజులు ఉన్నాయి. ఆ కష్టాలు తట్టుకోలేక చచ్చిపోదామని ఎన్నోసార్లు అనిపించేది. కానీ నాకు నేనే ధైర్యం చెప్పుకొన్నా. మంచి రోజులు వస్తాయని నమ్మా. ఆ నమ్మకమే నన్ను నిలబెట్టింది' అని చెప్పారు 74 ఏళ్ల మిథున్.

బాలీవుడ్‌పై బలమైన ముద్ర

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తి నట జీవితాన్ని మలుపు తిప్పిన సినిమా 'డిస్కో డాన్సర్'. అందులో 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై డాన్స్ చేస్తుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేశారు. అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ 1989లో 19 చిత్రాల్లో నటించి రికార్డ్ నెలకొల్పారు. బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరు తెచ్చుకోవడమే కాదు రెండుసార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హిందీలోనే కాకుండా బెంగాలీ, ఒరియా, భోజ్‌పురి భాషల్లో 370 పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో మిథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఈ నటుడు తనకు వచ్చిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌ను తన కుటుంబానికి, అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 8న జరిగే జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ అందజేస్తారు.

రా మచ్చా

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం నుంచి రెండోపాటను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. 'రా మచ్చా మచ్చా' అంటూ హీరో పాత్రను



పరిచయం చేస్తూ సాగే ఈ గీతానికి అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించారు. తమన్ స్వరాలు సమకూర్చగా, నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్నారు. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తిరుణావుక్కరుసు

శివరాత్రి పాట చిత్రీకరణలో



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. భారీ సెట్ వేసి అందులో నాగచైతన్య సాయిపల్లవిపై శివరాత్రి నేపథ్యంలో సాగే గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా పాట చిత్రీకరణకు సంబంధించిన రెండు పోస్టర్స్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. శివ పార్వతులను తలపించేలా నర్తిస్తున్న నాగచైతన్య, సాయిపల్లవి జంట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ: షామ్‌దత్.

కమిటీ కుర్రోళ్లు యాభై రోజుల వేడుక



నిహారిక కొణిదెల సమర్పణలో ఫణి అడపాక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం యాభై రోజుల వేడుక సోమవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. సీనియర్ నటీనటులతో పాటు పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తూ నిర్మించిన ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ వేడుకకు నాగబాబు, దిల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరైన యూనిట్ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ రోజుల్లో ఒక సినిమా 50 రోజులు పూర్తి చేసుకోవడం అరుదనీ, 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఆ రికార్డ్ సాధించినందుకు అతిథులు అభినందించారు.

దసరాకు వస్తున్న రాజావారు

ఇన్ ప్రోగ్రెస్



నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం దసరాకు విడుదల కానుంది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో సంపద హీరోయిన్. ఈ టీజర్‌ను దర్శకుడు వంశీ పైడిపల్లి విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ'నార్నే నితిన్ నటిస్తున్న మరో మంచి సినిమా 'శ్రీశ్రీశ్రీ రాజావారు', దసరాకు విడుదల చేస్తున్నాం' అన్నారు.

సిస్టర్ సెంటిమెంట్‌తో



రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వీ ప్రధాన పాత్రలు పోషించిన 'చిట్టి.. పొట్టి' చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా ఇది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'అన్నా చెల్లెలు అనుబంధం కథాంశంగా రూపుదిద్దుకున్న సినిమా ఇది. చెల్లెలుగా, మేనత్తగా, చివరికి బామ్మగా .. ఓ మహిళ జీవితంలోని ఎమోషనల్ జర్నీని ఇందులో చూపించాం. అక్టోబర్ 3న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

ముగింపు మెప్పిస్తుంది



నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన 'బహిర్భూమి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ మీద మీ సినిమా ట్రైలర్‌ను డిస్ ప్లే చేస్తున్నాం. తెలుగులో విడుదల చేసిన తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. బహిర్భూమి అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమా ముగింపు ప్రేక్షకులను మెప్పిస్తుందని నోయల్ చెప్పారు.

పరిష్కారం చూపే ప్రయత్నం



'మంత్ర' ఫేం ఓషో తులసీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'దక్షిణ'. సాయిధన్సిక లీడ్‌రోల్ పోషించారు. ఈ నెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తులసీరామ్ మాట్లాడుతూ 'ఇదొక సూపర్ థ్రిల్లర్. సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటికి పరిష్కారం చూపే ప్రయత్నం చేశాం' అన్నారు. సినిమా ఆసక్తికరంగా ఉంటుంది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని సాయిధన్సిక చెప్పారు.

పవన్‌ను విమర్శించేవాళ్లు సూడో సెక్యులరిస్టులు



నాగబాబు

'పవన్ కల్యాణ్ అసలైన సెక్యులరిస్ట్. ఆయన్ను విమర్శించేవాళ్లంతా సూడో సెక్యులరిస్టులు' అని నటుడు నాగబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై స్పందించారు. 'వైకాపా నాయకుల విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డూ కల్తీకి పాల్పడిన వారు ఎవరనేది విచారణలో తేలుతుంది. ప్రభుత్వాల అవినీతి వల్ల హిందూ ధర్మానికి ఆపద వాటిల్లుతోంది అనేదే పవన్ ఆవేదన. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంతో హిందూ ధర్మంపై జరుగుతున్న కుట్రలు పతాక స్థాయికి చేరాయి. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని నాగబాబు అన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన తెలుగు రాష్ట్రాల్లోని శ్రీవారి భక్తులకు మద్దతుగా సంగీత దర్శకుడు కీరవాణి 'ఓం నమో నారాయణాయ' పేరుతో ఓ ఆడియో రికార్డును విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో కీరవాణికి, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు.

దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు : ప్రకాశ్‌రాజ్

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వరుస ట్వీట్లతో తన అభిప్రాయాలను తెలుపుతూ వార్తల్లో నిలుస్తున్నారు నటుడు ప్రకాశ్‌రాజ్. లడ్డూ కల్తీ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ మరోసారి సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో స్పందించారు. 'దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగకండి' అంటూ దండం పెడుతున్న ఎమోజీలను ఆయన పోస్ట్ చేశారు.

వినోదం ప్లస్ సందేశం



సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. హీరో సుధీర్‌బాబు ఈ చిత్రం రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. పెళ్లి నేపథ్యంలో వినోదంతో పాటు చక్కని సందేశంతో తెరకెక్కిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సంగీతం: మణిశర్మ, చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

కొత్త కాన్సెప్ట్



సుగి విజయ్, జుప్పి భద్ర హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఐ హేట్ మ్యారేజ్ ' చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. పరమేశ్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఎం. దయానంద్ నిర్మిస్తున్నారు. నేటి యువతరంతో పాటు కుటుంబ సభ్యులకు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమా ఉంటుందనీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందనీ దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నంగా కొత్త కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తీస్తున్నాం. డిసెంబర్ వరకూ ఏకధాటిగా జరిగే షూటింగ్‌తో చిత్రం పూర్తవుతుంది' అని చెప్పారు.

కలి స్ఫూర్తిగా



జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు అనే అంశాన్ని 'కలి' చిత్రంలో చూపించబోతున్నాం. కలి పురుషుడి పాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం తెరకెక్కించాను' అని దర్శకుడు శివశేషు అన్నారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివశేషు సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'సమయాన్ని, ఆత్మను ఆధారంగా చేసుకొని కలి ఈ యుగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా చూపించాం. ఇందులో మంచి ప్రేమకథ కూడా ఉంది. వీఎఫ్ఎక్స్ మా సినిమాకు ప్రత్యేకార్షణ' అని చెప్పారు.



రైల్వే సహాయ మంత్రితో చర్చిస్తున్న గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని

రైల్వే సేవల విస్తరణకు సహకరించండి : పెమ్మసాని

గుంటూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన మౌలిక వసతులు, ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని, గుంటూరు, పరిసరాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా రైల్వే సేవల విస్తరణ జరగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కోరారు. రైల్వే శాఖ కేంద్ర సహాయ మంత్రి వీ సోమన్నను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో పెమ్మసాని సోమవారం వెళ్లి కలిశారు. పెండింగులో ఉన్న ప్రాజెక్టులను గురించి రైల్వే సహాయ మంత్రితో చర్చించారు. దీనిపై మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలియజేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి వస్త్ర ప్రదర్శన

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30: చేనేత ఉత్పత్తులు ప్రాముఖ్యంపై అవగాహన కల్పించి, తద్వారా నేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంపొందించుటమే చేనేత వస్త్ర ప్రదర్శన లక్ష్యమని చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి అన్నారు. 1వ తేదీ నుంచి 14 తేదీ వరకు గుంటూరు చంద్రమౌళినగర్ లో ఉన్న సిద్దార్థ గార్డెన్స్‌లో వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్టు సోమవాం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 80 చేనేత సహకార సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని వెల్లడించారు. కాటన్ చీరలు, పట్టు చీరలు, పావడాలు, దుప్పట్లు, డ్రెస్ మెటీరియల్, కలంకారి మొదలగు చేనేత ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలు జరుగుతాయని ఆమె తెలిపారు.

వారధిపై ప్రమాదంలో మరో మహిళ మృతి

రేపల్లె, సెప్టెంబరు 30 : పెనుమూడి-పులిగడ్డ వారధిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఆదివారం రాత్రి పెనుమూడి వారధి ఆర్టీసీ బస్సు టాటా ఏసీ ఢీకొనటంతో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందగా సోమవారం ఉదయం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బొచ్చలపూడి సౌజన్య(27)మృతిచెందింది. మృతుల కుటుంబాలను మాజీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పరామర్శించారు.వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విజిలెన్స్ సీఐగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకారం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా కొమ్మాలపాటి చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా ఉన్న అక్కిశెట్టి శ్రీహరి నెల్లూరు విజిలెన్స్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది.

సీపీడీసీఎల్‌లో ఎస్‌ఈల బదిలీలు

● పల్నాడుకు డాక్టర్ విజయ్‌కుమార్, సీఆర్‌డిఏకు సుబ్రమణ్యంలు ● గుంటూరు, బాపట్లకు ఇన్‌చార్జి ఎస్‌ఈల నియామకం



ఇన్‌ఛార్జ్ ఎస్‌ఈ కేవీఎల్ఎన్ మూర్తికి అభినందనలు తెలియజేస్తున్న పల్నాడు ఎస్‌ఈ విజయ్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 30: ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) సంస్థలో కొత్త సర్కిల్స్ ప్రక్రియ పునర్విభజన ముగిసిన నేపథ్యంలో ఆపరేషన్ ఎస్‌ఈలను నియమించారు. ఈ మేరకు సర్కిల్స్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)లతో పాటు ఇన్‌చార్జ్ ఎస్‌ఈలను నియమిస్తూ సంస్థ సీఎండీ పి రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని సీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జీఎంగా వ్యవహరిస్తున్న పీ సుబ్రమణ్యంను సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈగా నియమించారు. అలానే సీఆర్‌డీఏ ఎస్‌ఈగా ప్రస్తుతం గుంటూరు ఇన్‌ఛార్జ్ ఎస్‌ఈగా వ్యవహరిస్తున్న డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్‌ను పల్నాడు సర్కిల్ ఎస్‌ఈగా నియమించారు. అలానే గుంటూరు సర్కిల్ టెక్నికల్ ఈఈగా వ్యవహరిస్తున్న కేవీఎల్ఎన్ మూర్తిని గుంటూరు సర్కిల్ ఆపరేషన్‌ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు బాపట్ల డివిజన్ ఈఈగా వ్యవహరిస్తున్న జీ అంజనేయులును కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా నియమిస్తూ ఆదే శాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు సర్కిల్‌తో పాటు బాపట్ల, సీఆర్‌డీఏ సర్కిల్స్‌ను విభజించిన నేపథ్యంలో కొత్తగా ఎస్‌ఈల నియామకం చేపట్టారు. అయితే కొత్తగా ఏర్పడిన సర్కిల్స్‌లో డివిజన్ కేంద్ర కార్యాలయాలు ఎక్కడ, డివిజన్‌ల పరిధి, ఆయా సెక్షన్‌లు పరిధి ఎంత వరకు అనే దానిపై నేటికీ స్పష్టత కొరవడింది. కొత్త సర్కిల్స్‌లో డివిజనల్ కార్యాలయాలు, వాటిల్లోని సెక్షన్‌ల పరిధి వంటి ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

రైతులను ముంచిన కమీషన్ ఏజంట్

● 500 మిర్చి టిక్కీల వరకు వారికి తెలియకుండా విక్రయం ● లబోదిబోమంటున్న యర్రగొండపాలెం రైతులు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డులో ఒక కమీషన్ ఏజంట్ రైతులను నమ్మించి నట్టేట ముంచాడు. తన మీద రైతుల్లో నమ్మకాన్ని ఏర్పరుచుకొని వారి మిర్చి టిక్కీలను శీతల గిడ్డంగిలో నిల్వ చేయించి వారికి తెలియకుండా వాటిని అమ్మేశాడు. దాదాపుగా 500 మిర్చి టిక్కీల వరకు ఇలా విక్రయించి ఉంటాడని సమాచారం. స్థానిక అంకిరెడ్డిపాలెం సమీపంలోని రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన రైతులు తమ మిర్చి టిక్కీలను కమీషన్ ఏజంట్ రాము ద్వారా నిల్వ చేశారు. రాముపై ఉన్న నమ్మకంతో వాటికి సంబంధించి బాండ్ పేపర్లు కూడా వారు తీసుకోలేదు. ఇదే అదనుగా రాము దాదాపుగా రూ.30 లక్షలకు పైగా విలువ చేసే రైతులకు సంబంధించిన మిర్చి టిక్కీలను వారికి తెలియకుండానే విక్రయించేశాడు. మరి కొందరి మిర్చి బస్తాలను కూడా అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. కాగా ఇప్పుడిప్పుడే మిర్చి మార్కెట్ ఊపందుకొంటుండటంతో రైతులు కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చిని విక్రయించడానికి వస్తున్నారు. యర్రగొండపాలెం రైతులు కూడా వారి మిర్చిని విక్రయించుకొనేందుకు రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌కు రాగా అక్కడ వాళ్ల టిక్కీలు కనిపించలేదు. దాంతో వారంతా ఆందోళనకు దిగారు. ఈ విషయం మార్కెట్ కమిటీ దృష్టికి రావడంతో సెక్రెటరీ ఐ వెంకటేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు యార్డు ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్ సోమవారం ఉదయం రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌కి వెళ్లి పరిశీలించగా దాదాపుగా రైతులకు సంబంధించిన 500 టిక్కీల వరకు లెక్క తేలలేదు. ఆరుగురు రైతులకు మాత్రం అప్పటికప్పుడు బాండ్లు ఇప్పించారు. సుమారు 20 నుంచి 25 మంది రైతులు మిర్చి టిక్కీలను కమీషన్ ఏజంట్ రాము తన ఆధీనంలోకి తీసుకొన్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు మంగళవారం కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాన్ని యార్డుకు రావాల్సిందిగా ఆదేశించామని ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్ తెలిపారు. రాము అనే వ్యక్తి బలవన్మరణానికి ప్రయత్నించి ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఏది ఏమైనా రైతులకు న్యాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు.

లోకేశ్ ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 30: ఉండవల్లి నివాసంలోని నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో 37వ రోజు పలువురు తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు విన్నవించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు దివ్యాంగులు తమ ఇబ్బందులను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామస్తులు మంత్రి లోకేశ్‌ను కలిసి గ్రామంలోని చింతలమ్మతల్లి దేవస్థానం అభివృద్ధికి సహకరించండి అంటూ విజ్ఞప్తి చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని, వర్షాకాలంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో నీరు చేరి భక్తులకు అసౌకర్యంగా ఉంటుందని దేవస్థాన అభివృద్ధి పనులకు ఆదేశాలు ఇవ్వాలని లోకేశ్‌ను కోరారు. పరిశీలించి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కురగల్లుకు చెందిన రాయుడు రాజు గ్రామానికి చెందిన వ్యక్తి పొలం రిజిస్ట్రేషన్ చేయకుండా అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, గతంలో సదరు పొలం మ్యుటేషన్ జాబితాలో ఉందని, అనంతరం ప్రభుత్వం తొలగించిందని ఈలోగా భూమి విక్రయించిన ఎలీషా మరణించడంతో అతని కుమారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని సమస్య పరిష్కరించాలని కోరారు. ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని నూతక్కికి చెందిన జయభరత్ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడైన తమ కుమారుడికి వీల్ ఛైర్ అందించాలని కుంచనపల్లికి చెందిన లక్ష్మీ తిరుపతమ్మ దంపతులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో అప్పటికప్పుడు నూతన వీల్‌ఛైర్‌ను అందించారు.

బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన గేదెలు వరదల్లో గల్లంతయ్యాయని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఇబ్రహీంపట్నంకు చెందిన గ్రామస్తులు పలువురు మంత్రి లోకేశ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని లోకేశ్ తెలిపారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం ముడివేములకు చెందిన రామినేని సురేష్‌బాబు మంత్రి లోకేశ్‌ను కలిసి తాను స్థాపించిన మాతృధరణి ప్రాజెక్ట్సు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని కాజేసేందుకు మంగళగిరి నియోజకవర్గం కాజకు చెందిన వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ ప్రయత్నిస్తున్నారని వారి నుండి తనకు ప్రాణహాని ఉందని వాపోయారు. లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని నంద్యాలకు చెందిన కురువ మద్దిలేటి విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన స్థలాన్ని కబ్జా చేసి రాత్రికి రాత్రి రోడ్డు నిర్మించారని అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డకు చెందిన యాసం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.

మంగళగిరిలో నైపుణ్య గణనకు శ్రీకారం

మంగళగిరి, సెప్టెంబరు 30: దేశంలోనే తొలిసారిగా ఏపీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నైపుణ్య గణన ప్రాజెక్టుకు మంగళగిరి నుంచి శ్రీకారం చుట్టారు. పైలట్ ప్రాజెక్టుగా మంగళగిరి నియోజకవర్గంతోపాటు తుళ్లూరు మండలంలో స్కిల్ సెన్సెస్‌ను చేపట్టనున్నారు. ఇందుకోసం వంద గ్రామ సచివాలయాల పరిధిలో సెన్సెస్ సేకరణకు సంబంధించిన లాగిన్ ఇచ్చారు. యువతలో నైపుణ్యాలను గుర్తించి, వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి అందించడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించడమే స్కిల్ సెన్సెస్ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. మంగళగిరి నియోజకవర్గంలో 1,35,914 గృహాలు, తుళ్లూరు మండలంలో 25,507 గృహాలు కలిపి మొత్తం 1,61,421 కుటుంబాల నుంచి 675 మంది ఎన్యుమరేటర్లు నైపుణ్య గణన చేపట్టనున్నారు. దీనికి అవసరమైన మొబైల్ యాప్‌ను సిద్ధం చేశారు. ఎన్యుమరేటర్ల శిక్షణ కూడా పూర్తయింది. ఫీల్డ్ టీమ్స్‌కు సహాయం చేసేందుకు టెక్నికల్ టీమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లు, కుటుంబాలకు సంబంధించిన మ్యాపింగ్ పూర్తయింది. గ్రామ సచివాలయాలో, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ, సీడాప్, న్యాక్ విభాగాల సిబ్బంది స్కిల్ సెన్సెస్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారు. పైలట్ ప్రాజెక్టులో ఏమైనా లోపాలను గుర్తిస్తే సరిదిద్ది రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెన్సెస్ ప్రక్రియను ప్రారంభిస్తారు.

పైలట్ ప్రాజెక్టుగా అమలు!



నైపుణ్య గణన నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్, న్యాక్ సిబ్బంది

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ఎట్టకేలకు ప్రారంభమైంది. ఎస్‌ఏఎన్‌డీ.ఏపీ.జీవీవీ.ఐఎన్ పోర్టల్‌లో సోమవారం ఉదయం నుంచి వినియోగదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. విజయవంతంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొన్న వారికి ఇసుక బుకింగ్ ఆప్షన్ తెరుచుకొన్నది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్ జిల్లాల్లో స్టాక్‌యార్డుల నుంచి ఇసుక బుకింగ్ చేసుకొనే సదుపాయం కల్పించారు. అయితే బుకింగ్స్ ప్రారంభించిన కొద్దిసేపటికే ఈ వారం వరకు స్టాకు అయిపోయింది. దాంతో చాలామంది తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వచ్చే వారం శ్లాట్స్ మంగళవారం నుంచి తెరుచుకొంటాయో లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న బుజ్జి మిత్రమండలి సభ్యులు, చిత్రంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం

గుంటూరు, సెప్టెంబరు 30 : పర్యాటక శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి భవనం ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి తమ నుంచి రూ. 15 లక్షలు తీసుకొని మోసం చేశాడని శ్యామలనగర్‌కు చెందిన ఎండ్లూరి మణెమ్మ అనే బాధితురాలు తన కుమారుడితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పర్యాటక శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని 2023 ఏప్రిల్ 19న తాడేపల్లి లోని తన ఇంటికి పిలిపించుకొని తమ వద్ద రూ. 15 లక్షలు తీసుకున్నాడన్నారు. ఆ తర్వాత ఉద్యోగం రాకపోవడంతో ఉద్యోగం గురించి ఎన్ని సార్లు అడిగినా కాలయాపన చేస్తుండడంతో అనుమానం వచ్చి నిలదీయగా అంతా మోసమని అర్థమైంది అన్నారు. దీంతో తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అడగ్గా డబ్బు తిరిగి ఇచ్చేస్తానని కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. ఈ క్రమంలో తాడేపల్లిలోని ఆయన ఇంటి వద్దకు డబ్బులు అడగడానికి వెళ్ళగా తాడేపల్లి పోలీసులను పిలిపించి తమను భయభ్రాంతులకు గురిచేసి అరెస్ట్ చేసి లోపల వేయిస్తానని బెదిరించాడన్నారు. తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని తమ వద్ద రూ.15 లక్షలు తీసుకొని మోసం చేయడమే గాక తమను పోలీసులతో బెదిరింపులకు గురిచేసిన భవనం ఈశ్వర్‌రెడ్డిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమ డబ్బు తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితురాలు మణెమ్మ, ఆమె కుమారుడు ఎనేష్ బాబు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అన్నక్యాంటీన్‌కు రూ. 5 లక్షల విరాళం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 : రాష్ట్రంలోని నిరుపేదల కడుపునింపుతున్న అన్నా క్యాంటీన్ల నిర్వాహణకు పెదకూరపాడు నియోజకవర్గ నేత బుజ్జి మిత్రమండలి ఆధ్వర్యంలో రూ. 5 లక్షల విరాళం అందజేశారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేశారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళం అందజేసిన బుజ్జి మిత్రమండలిని సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎంపీపీ ఎస్ వీవీ ఎస్ వరప్రసాద్(బుజ్జి), కన్నెదార వసంత రావు, రాయపూడి శంకరరావు, బత్తుల మల్లి, నాదెండ్ల బాబు, పతకమూరి వెంకటేశ్వరరావు, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00



రాష్ట్ర స్థాయి బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన విశాఖపట్నం జిల్లా జట్టు

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 30: పల్నాడుజిల్లా వినుకొండ లయోల పాఠశాల్లో గత మూడు రోజులుగా సాగిన ఫుట్‌బాల్ ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. స్కూల్ గేమ్ అండర్ 17 బాలుర విభాగంలో ఫైనల్‌లో అనంతపురం జట్టుపై విశాపట్నం జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్‌లో అనంతపురం, కడప తలపగా, కడప జిల్లా జట్టు విజయం సాధించింది. అనంతరం ఫుట్బాల్ సెక్రటరీ సురేష్ కమార్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయా జట్లకు స్థానిక ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు బహుమతులు అందజేశారు.

ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

చిలకలూరిపేట, సెప్టెంబరు 30: జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చిలకలూరిపేటకు సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి షేక్ ఉమర్(19) దుర్మరణం చెందాడు. ప్రమాదంలో ఇతడి స్నేహితుడు సోయబ్ తీవ్రంగా గాయపడడంతో చికిత్సకై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిద్దరూ స్కూటీపై సమీపంలోని రెస్టారెంట్‌కు వెళుతుండగా వ్యతిరేక దిశలో వేగంగా వచ్చి అదుపు తప్పిన ఒక కారు డివైడర్‌ను దాటి వచ్చి వీరి స్కూటీని ఢీకొన్నది. మృతి చెందిన ఉమర్ గుంటూరుకు సమీపంలోని ఓ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఉమర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్చకుడిపై దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



పొన్నెకల్లు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న అర్చక, బ్రాహ్మణ సంఘం నేతలు

తాడికొండ, సెప్టెంబరు 30: పొన్నెకల్లు శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం అర్చకుడిపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయా లని అర్చక, బ్రాహ్మణ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమ వారం రాత్రి దాడికి గురైన అర్చకుడు బాపేశ్వర శర్మను అర్చక, బ్రాహ్మణ సంఘం నేతలు పరామర్శించి, దాడికి పాల్పడిన కన్నెబోయిన వెంకయ్యను అరెస్టు చేయాలని డిమాండ్ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్చక సంఘం నేతలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో దేవాలయ అర్చకులపై 40 దాడులు జరిగాయని తెలిపారు. దేవాలయాల్లో అర్చకులకు రక్షణ లేకుండా పోయిందని, అర్చక వ్యవస్థ లేకపోతే దేవాలయాలు మనుగడ సాధించటం కష్టమని పేర్కొన్నారు. అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ, ఏపీ స్వచ్ఛతా సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, రాష్ట్ర నాయకులు యనమదల ఆంజనేయులు, జిల్లా అదిశైవ సంఘ అధ్యక్షుడు కొలకలూరి శ్రీనివాస్ శర్మ, ఐలూరి శ్రీనివాస్ శర్మ, ప్రత్తిపాటి మాధవ శర్మ,పవన్ శర్మ, పోగుల మురళీకృష్ణ, కొడవటిగంటి నాగ పార్వతీశ్వర శర్మ కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అనుచరులు బెదిరింపు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 30: మాజీ మంత్రి రజిని, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు అక్రమంగా నగదు వసూలు చేసి తిరిగి అడిగితే బెదిరిస్తున్నారని సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితులు అదనపుఅడ్మిన్ ఏ ఎస్ పి సంతోష్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేటకు చెందిన మున్నంగి వెంకట రత్నారెడ్డి ఫిర్యాదు చేస్తూ మాజీ మంత్రి రజిని పీఏ శ్రీకాంత్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సప్లయి చేయడానికి అనుమతులు ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకొని మోసం చేసినట్లు అడ్మిన్ ఏఎస్పి సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనుచరులు ఒక భవన నిర్మాణానికి మూడు కోట్ల 10 లక్షల రూపాయలు అవుతుందని చెప్పి చందా వసూలు చేసి మోసం చేసినట్లు బాధితులు ఏఎస్పి సంతోష్‌కు ఇచ్చిన మరో ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో బాధితులు వివిధ సమస్యలకు సంబంధించి 67 ఫిర్యాదులు అందజేశారు.

51,039 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 52,124 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 27,326 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	9000	16000
నెంబరు. 5	9000	14000	నెంబరు. 5	10500	15000
273	9000	13500	273	11000	11000
341	9000	17000	341	9000	16000
4884	–	–	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	11200	15500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18600	తేజ	9500	18500
బ్యాడిగి	10000	15300	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	9500	16000	దేవనూరు డీలక్స్	13000	13500
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	5200	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వడ్డెర కార్మికులకు అండగా యరపతినేని



ఎమ్మెల్యే యరపతినేనిని కలిసిన వడ్డెర సంఘ కార్మికులు

మాచవరం, సెప్టెంబరు 30: మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన వడ్డెర కార్మికులకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అండగా నిలిచారు. సోమవారం గ్రామానికి చెందిన పలువురు వడ్డెర కార్మికులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును గుంటూరులో కలిసి వారి సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. పనుల్లేక రోజువారీ కూలీ పనులు చేసుకుంటేనే జరుగుబాటు ఉండే కుటుంబాలు అని, మాకు రోజువారి పనులు కల్పించాలంటూ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన యరపతినేని కార్మికులకు పనులు కల్పించే బాధ్యత నేను తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యరపతినేనికి వడ్డెర కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కర్రూపపు వెంకటేష్, తురకా శ్రీను, కోటేశ్వరరావు, రాంబాబు, అచ్చయ్య, మల్లవోలు టీడీపీ నాయకులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 30: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సచివాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ప్రతిమను సీఎంకు అందించి నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయించాలని కోరారు.

2 నుంచి ఉపాధి హామీ పథకం గ్రామసభలు

బెల్లంకొండ, సెప్టెంబరు 30: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభలు ఈనెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు ఏపీవో కోటమ్మ పేర్కొన్నారు. గ్రామ సభల్లో ప్రజల ఆమోదం తెలిపిన తరువాతే ఆ పనులను ప్రవేశపెడతామని పేర్కొన్నారు. గ్రామ సభలకు పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరు అసిస్టెంట్‌లు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెలుగు సీసీలు గ్రామసభలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి : ఎంపీపీ

దుర్గి, సెప్టెంబరు 30: మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల 2వ తేదీన నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీపీ సునీతా శంకర్ కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో చిన వెంకటేశ్వర్లు, ఏవో అమీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజంతోనే మెరుగైన ఫలితాలు

పెదకూరపాడు, సెప్టెంబరు 30: పారిశుధ్యం, పరిసరాల శుభ్రత ఆరోగ్య సమాజంతోనే మెరుగైన ఫలితాలు వస్తాయని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకటరమణ అన్నారు. పెదకూరపాడులో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవపై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు సోమవారం ప్రోత్సాహక బహుమతులతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్లను, ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

● మండలంలోని లగడపాడులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ గంగాధర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 30 : పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఫణిదం పీఏసీఎస్‌లో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘ ఆవరణను శుభ్రంచేసి మొక్కలను నాటారు.

పాఠశాల 75 వసంతాల వేడుకలపై సమీక్ష

రెంటచింతల, సెప్టెంబరు 30: పల్నాట అత్యంత ప్రతిష్ఠాకరమైన విద్యాసంస్థల్లో ఒకటైన సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాల వేడుకల నిర్వహణపై సోమవారం కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య అధ్యక్షతన ప్రస్తుత, విశ్రాంత హెచ్‌ఎంలు, పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, విశ్రాంత హెచ్‌ఎంలు తుమ్మాలూర్రెడ్డి, కె.చిన్నపరెడ్డి, బంగారు కోటయ్యాచారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరు ఎక్సైజ్ సీఐగా తులసి బాధ్యతల స్వీకరణ



ఎక్సైజ్ సీఐ తులసి

క్రోసూరు, సెప్టెంబరు 30: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌ర సీఐగా నియమితులైన టీ తులసీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఆమె ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించి అనంతరం సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. గతంలో ఆమె ప్రత్తిపాడు, సత్తెనపల్లి, గుంటూరు వన్ టౌన్ స్టేషన్లలో ఎక్సైజ్ ఎస్‌ఐగా పని చేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చినట్టు తెలియజేశారు. మూడు మండలాల ఎక్సైజ్ ఎస్‌ఐలు ఆమెను గౌరవ పూర్వకంగా కలుసుకున్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై అవగాహన సదస్సు

అచ్చంపేట, సెప్టెంబరు 30: అచ్చంపేటలోని పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామి పథకంపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఏపీవో నాగ శ్రీనివాస్ తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను పనులు గుర్తింపుకై సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల తహసీల్దార్ వీ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీన గ్రామసభ నిర్వహించి ఉపాధి పథకం పనులను ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఉపాధి పథకంలో ఉన్న 78 రకాల పనులను సక్రమంగా ఉపయోగిస్తే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయని నాగ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా టీపీ రాజవర్ధన్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరరాజు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు విలేజ్ సర్వేయర్లు, సీసీలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీ కల్చర్‌కు చెందిన ఇతర అధికారులందరూ పాల్గొన్నారు.

అపుస్మా జిల్లా అధ్యక్షుడిగా పీజేఎన్ ధన్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన పీజేఎన్ ధన్, జిల్లా కార్యదర్శిగా మద్దిరాల శ్రీనివాసరావు (చిలకలూరిపేట), జిల్లా కోశాధికారిగా కారంపూడికి చెందిన వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అపుస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ తులసీ విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పల్నాడు జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్లు హాజరుకాగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు పోతిరెడ్డి, మస్తాన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికైన నూతన సభ్యులను సన్మానించారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

దాచేపల్లి, సెప్టెంబరు 30: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా వివిధ జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో పల్నాడు జిల్లా నుంచి షేక్ మస్తాన్‌వలి, స్వర్ణరాజులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 4వ తేదీన గుంటూరులోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే పోటీలకు పల్నాడు జిల్లా తరపున మస్తాన్‌వలి, స్వర్ణరాజులు హాజరుకానున్నారు. గుంటూరులో 4, 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయి. దాచేపల్లిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మస్తాన్‌వలి, స్వర్ణరాజులు క్యారమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పల్నాడు జిల్లా యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు ప్రేమకుమార్, ప్రధాన కార్యదర్శి విజయసారథి, షేక్ ఖాశిం పీరాలు అభినందనలు తెలియజేశారు.

అంతా చెత్తే.. సంపద ఎక్కడ

● గ్రామాల్లో నిరుపయోగంగా చెత్తసంపద కేంద్రాలు



బ్రాహ్మణపల్లి రహదారి పక్కనే పడవేసిన చెత్తా చెదారం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 : గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్త నుంచి వానపాముల తయారీ విధానానికి 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఎక్కడ బడితే అక్కడ వేయకుండా, తగులబెట్టకుండా గ్రామాల్లో ఓ ప్రాంతంలో నిర్మించిన చెత్తసంపద కేంద్రాలకు తరలించి అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు వాటి



నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

ద్వారా వ్యవసాయ పొలాలకు ఎరువుగా వాడే విధంగా తయారీ విధానాన్ని కూడా అప్పట్లో పంచాయతీ కార్యదర్శులకు, మరికొంత మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలను నిరుపయోగంగా మార్చేసి వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో చెత్తసంపద కేంద్రాలన్నీ మందుబాబులకు నిలయాలుగా మారాయి. అంతేకాకుండా చెత్త సంపద కేంద్రాలు వాడుకలో లేకపోవడంతో ఇంటింటి నుంచి సేకరించిన చెత్త రహదారుల వెంట పడవేసి నిప్పుపెట్టడంతో ఆ ప్రాంతమంతా కాలుష్యంగా మారిపోతుంది. వర్షాకాలంలో రోడ్డు పక్కన పడవేసిన చెత్త చెదారం, వ్యర్థాలతో దుర్వాసన రావడమే కాకుండా దోమల వ్యాప్తికి కారణమవుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలి

● టిడ్కో గృహాలను త్వరగా పూర్తి చేయాలి

● పలు సమస్యలను విన్నవించిన కౌన్సిలర్లు

● సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం : మున్సిపల్ చైర్మన్



సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 30: పట్టణంలోని మూడు అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని కౌన్సిలర్ గట్ల అరుణకుమారి కోరారు. పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ గట్ల అరుణకుమారి మాట్లాడుతూ పట్టణంలోని సైడు కాలువల్లో మలాథియాన్, బ్లీచింగ్ చల్లించి ఫాగింగ్ చేయించాలన్నారు. కౌన్సిలర్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నుంచి అద్దెలను వసూలు చేయాలన్నారు. టిడ్కో హౌసింగ్ గృహాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సహకారంతో సమస్యలన్నింటినీ పరిష్కరించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ ఉదయం పట్టణంలోని పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పనులు జరిగేందుకు ర్యాటిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. టిడ్కో గృహాలు వద్దని చెప్పిన వారికి నగదు వాపస్ ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. వాటర్ ట్యాంకుల ద్వారా శివారు కాలనీలకు నీటిని అందించడం వంటి అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, డీఈ మధుసూదన్‌రావు, ఏఈ ఆదిత్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ అరుణకుమార్

అచ్చంపేట, సెప్టెంబరు 30: అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, అండర్ - 17 బాలబాలికల విభాగాల్లో రెజ్లింగ్ జిల్లా స్థాయి పోటీలు జరిగినట్టు అచ్చంపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ అరుణకుమార్ తెలిపారు. అండర్- 14 బాలికల విభాగంలో సాంఘిక సంక్షేమ పాఠశాల విజయపురిసౌత్‌కు చెందిన ఎం అనూష, బీ అలేఖ్య, ఎం పూజిత, ఎస్ మేరి వెన్నెల, కే నందిని, సాంఘిక సంక్షేమ పాఠశాల బాపట్లకు చెందిన సీహెచ్ శారద, పీ రోజ, కే శ్రీజ, అమరావతికి చెందిన టీ ప్రవల్లిక ఎంపికయ్యారు. అండర్ - 14 బాలుర విభాగంలో సాంఘిక సంక్షేమ అచ్చంపేట గురుకుల పాఠశాలకు చెందిన పీ నాగచరణ్, యూ గౌరీ ప్రతాప్, ప్రనీత్, వై మధు, డీ సుధీర్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అడవి తక్కెళ్ళపాడుకు చెందిన ఎం జానీ సమోయల్, ప్రవీణ్‌కుమార్, కే అంకితరాజు, బీ సూర్యకృష్ణ, అండర్ 17 బాలికల విభాగంలో విజయపురిసౌత్‌కు చెందిన పీ కావ్య, బీ మాధురి, ఆర్ అనూష, ఏ సంధ్య, అమరావతి గురుకుల పాఠశాలకు చెందిన పూజా మహేశ్వరి, బీ లక్ష్మణ, బాపట్లకు చెందిన సీహెచ్ రోస్లిన్, కే రోజా, జీ అమూల్య, డీ ప్రిన్సి, అండర్ - 17 బాలుర విభాగంలో అచ్చంపేట గురుకుల పాఠశాలకు చెందిన ఎస్ బాబు, కే గోపయ్య, వీ పృథ్వీ, బీ సంతోష్, కేవీఎల్ చక్రధర్, జీ జాన్సన్, బీ సుందర పాల్, బీ ధనూష్, ఎం వెంకటేష్, జీ డేవిడ్, ఎస్ వంశీ, ఆర్ అశోక్ కుమార్, ఎం వర ప్రసాదు, డీ కుమార్‌బాబు, జేకే దిక్సూరామ్, జీ రాజు, తాడికొండకు చెందిన జీ చరణ్ తేజ, అడవి తక్కెళ్ళపాడుకు చెందిన టీ పవన్‌కుమార్, అచ్చంపేట గ్లూబెల్ హైస్కూల్‌కు చెందిన వేమవరపు మహదేవ్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 3, 4, 5 తేదీల్లో కృష్ణా జిల్లాలోని నున్నా గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి

మాచర్లటౌన్, సెప్టెంబరు 30: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సేవా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతురావులు తెలిపారు. సోమవారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వాసవీదత్తు, మాశెట్టి సైదారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం ఆరోగ్యానికి మేలు



బాలింతలు, గర్భిణులను సన్మానిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30: ప్రతి మహిళ యుక్తవయసు నుంచే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పిడుగురాళ్ల సీడీపీవో రుక్సానా తెలిపారు. పోష కాహార మాసోత్సవాల ముగింపుసభ సోమవారం పిడుగురాళ్లలో నిర్వహించారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు బలవర్ధకమైన పోషకాహారాన్ని ఇంటివద్దనే అందజేస్తారన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, కోట హరి, షేక్ సైదా, కామిశెట్టి రమేష్, జమ్మిశెట్టి రామకృష్ణ, వల్లెపు రామకృష్ణ తదితరులు పాల్గొని గర్భిణులు, బాలింతలను సన్మానించడంతో పాటు చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 30: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని తాళ్లపల్లిలో జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓర్సు శివకు మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన బత్తుల గాయత్రితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. శివ తన అత్తగారి ఊరైన తాళ్లపల్లిలో మూడేళ్లగా భార్యా బిడ్డలతో కలిసి జీవిస్తున్నాడు. గ్రామ సమీపంలోని పవర్‌గ్రిడ్‌లో లేబర్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శివ కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఒంట్లో బాగాలేదని ట్యాబెట్లు వేసుకొని నిద్రించాడు. సోమవారం తెల్లవారుజామున భార్య గాయత్రి లేచి చూడగా భర్త శివ అచేతనంగా ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి చూడగా శివ మృతి చెందినట్లు గుర్తించారు. కాగా శివ తల్లి ఓర్సు రమణమ్మ ఫిర్యాదుతో విజయపురిసౌత్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

మాచవరం, సెప్టెంబరు 30: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు సైన్స్, సోషల్ తదితర పాఠ్యపుస్తకాలు రావడంతో విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపిశెట్టిపాలెంలో పూరిల్లు దగ్ధం

నకరికల్లు, సెప్టెంబరు 30: మండలంలోని కుంకలగుంట గ్రామ శివారు పాపిశెట్టిపాలెంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా షేక్ మస్తాన్‌వలికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఆ సమయంలో మస్తాన్‌వలి, ఆయన భార్య సిద్దాబీ ఇంట్లో లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.3వేల నగదు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైనట్టు మస్తాన్‌వలి తెలిపారు.

టీడీపీలో చేరిన సర్పంచ్ మరియమ్మ దంపతులు

నకరికల్లు, సెప్టెంబరు 30 : వైసీపీకి చెందిన కుంకలగుంట గ్రామ సర్పంచ్ సుంకర మరియమ్మ, ఆమె భర్త మత్తయ్య ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే కన్నా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఆవుల సుబ్బయ్య, మర్రివేముల సిద్ధయ్య, రుసుం కోటయ్య, సాగి శ్రీను, కొమ్మూరి కొండలు పాల్గొన్నారు.

భవితకేంద్రం పరిశీలన

ముప్పాళ్ళ, సెప్టెంబరు 30: ముప్పాళ్ళ హైస్కూల్లో ఉన్న భవితకేంద్రంను స్టేట్ కో-ఆర్డినేటర్ మల్లికార్జున, ఎంఈవో సీతారామిరెడ్డిలు సోమవారం పరిశీలించారు. పాఠశాలలోని ప్రత్యేకావసరాలు గల బాలబాలికలను పాఠశాలలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ వంటి రకరకాల సేవలను సర్వశిక్ష అభియాన్ ద్వారా అందజేస్తున్నట్టు వారు తెలిపారు. వారి వెంట జిల్లా కో-ఆర్డినేటర్ సెల్వరాజు, ఉపాధ్యాయులు అర్జున్, శ్రీలత, శ్రీనివాస్, పిల్లల తల్లిదండ్రులు ఉన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 30: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 588.90 అడుగులు ఉంది. ఇది 308.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 49,061 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 49,061 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 30: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 41.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఈఏ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,291 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,887 క్యూసెక్కుల నీరు ఒక గేటు ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి విడుదల అవుతుంది.

క్రీడా పోటీలతో ప్రతిభకు గుర్తింపు

రెంటచింతల,సెప్టెంబరు 30 :క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య అన్నారు. కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల నుంచి కబడ్డీ ఆటలో జిల్లా స్థాయికి ఎంపికైన బాల బాలికలను సోమవారం నిర్వహించిన అభినందన సభలో సత్కరించారు. అండర్-17 విభాగంలో శివప్రసాద్, లక్ష్మయ్య, బాలికల్లో హారిక, డి.జయంతి, అండర్- 14 విభాగంలో బాలికలైన సుస్మిత, అఖిల ఎంపికయ్యారు.

ఈక్రాపు, ఈకేవైసీ పూర్తి చేసుకున్న వారికే పథకాలు

నకరికల్లు, సెప్టెంబరు 30: పంట సాగు చేసుకున్న రైతులు గానీ, కౌలు రైతులు గానీ తాము సాగు చేసుకున్న పంటలను ఈక్రాపు నమోదు చేసుకోవటంతో పాటు ఈకేవైసీ కూడా పూర్తి చేసుకోవటం ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలు పొందే అవకాశం ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి తెలిపారు. సోమవారం రూపెనగుంట్లలో రైతు సేవాకేంద్రంలో ఆమె ప్రసంగించారు. వరిలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు.

మండలంలో 76 శాతం ఈక్రాపు నమోదు

ఈక్రాపు నమోదు గడువు ముగిసే తేదీ నాటికి నకరికల్లు మండలంలో 76 శాతం సగటు నమోదైనట్టు ఏవో కే దేవదాసు తెలిపారు. నకరికల్లు, చీమల మర్రి, కుంకలగుంట మొదటి స్థానాల్లో ఉండగా దిగువ నుంచి చేజర్ల, రూపెనగుంట్ల, నరసింగపాడు, త్రిపురాపురం, దేవవరం, కండ్లకుంట, గుండ్లపల్లి, చల్లగుండ్ల ఉన్నట్టు తెలిపారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

● పోషకాహార మాసోత్సవాల ముగింపు సభలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పోషకాహార మాసోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 30: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల ముగింపు సభను నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. నియోజకవర్గంలోని గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరికి పోషకాహారాన్ని అందిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఆహారపు అలవాట్ల గురించి ప్రభుత్వం అవగాహన కల్పిస్తుందన్నారు. తినే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరం అన్నారు ప్రతి ఒక్కరు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, కట్టా శంకరరావు, భీమినేని వందనాదేవి, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

● సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు



నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అప్పారావు

దాచేపల్లి, సెప్టెంబరు 30: దాచేపల్లి నగర పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిలో విధుల నుంచి తొలగించిన వారిని పనిలోకి తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. సోమవారం దాచేపల్లి సచివాలయం-1లో నగర పంచాయతీ సమావేశం జరిగింది. సమావేశంలో రానున్న దసరా ఉత్సవాల్లో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మ నిమజ్జనాలకు ఊరేగింపుగా వెళ్తారు. కావున మహిళలకు ఇబ్బందులు లేకుండా రహదారులు, విద్యుత్‌లైట్ల ఏర్పాట్లు చేయాలని తీర్మానం చేశారు. మరో ఇతర ఏడు అంశాలను ఆమోదించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షత వహించగా కౌన్సిలర్లు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అప్పారావు, నగర పంచాయతీ మేనేజర్ ఓలేటి నాగభూషణ ప్రసాద్ తదితర సిబ్బంది హాజరయ్యారు.

కింద కూర్చొని నిరసన వ్యక్తం చేసిన కౌన్సిలర్

దాచేపల్లి నగర పంచాయతీ సాధారణ సమావేశంలో 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ నగర పంచాయతీ సిబ్బంది తీరును వ్యతిరేకిస్తూ కింద కూర్చొని సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ఉత్సవ విగ్రహాల్లా, జీవంలేని యంత్రాల్లా నగర పంచాయతీ వార్డుల్లో కౌన్సిలర్లు ప్రతిపాదించిన పనులు కాకుండా చైర్మన్, బయటి వ్యక్తులు ప్రతిపాదించిన పనులు అజెండాలో పెట్టి తీర్మానాలు చేయించుకుంటున్నారు. కౌన్సిలర్లు బాధ్యతగా స్థానిక సమస్యలను నగర పంచాయతీ సిబ్బంది దృష్టికి తెచ్చినప్పటికీ తాము తెచ్చిన సమస్యలను నిర్వీర్యం చేస్తున్నారని షరీఫ్ ఆరోపించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30: పట్టణంలో పలు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. 8వ వార్డులో కుక్కల బెడద తొలగించాలని, 9వ వార్డులో కాల్వల్లో మురుగును తొలగించాలని, మెయిన్‌రోడ్డులో మురుగు కాల్వల్లో వ్యర్థాలను తొలగించేందుకు దుకాణాల ముందు కాల్వలపై వేసిన బండలను తొలగించాలని కోరారు. కళ్లం టౌన్‌షిప్‌లో వీధిలైట్లు వెలగటం లేదని, వీధుల్లో మంచినీటి కుళాయిలకు ట్యాప్‌లు విరిగిపోవడం వల్ల నీరు ధారాళంగా పోతుందని కౌన్సిలర్లు అన్నెం పద్మావతి, కొత్త తులసి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నాడు- నేడు పథకం పనులకు నిధులు ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తిచేయాలని పలు పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు ఉండాలని చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు.

రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మండల టీడీపీ నాయకులు

బెల్లంకొండ, సెప్టెంబరు 30 : మండలంలోని చంద్రాజుపాలెం గ్రామం నుంచి బ్రహ్మంగారి మఠం వద్దకు రూ.1.50 కోట్ల నిధులతో తారు రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం చంద్రాజుపాలెం గ్రామ సమీపంలో నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం రూ.1.50 కోట్ల నిధులతో తారు రోడ్డును చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గంగిరెడ్డిపాలెం సర్పంచ్ కాసుల జగన్, అక్కల వెంకట రామిరెడ్డి, పార్లమెంట్ బీసీ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, తమ్మిశెట్టి సత్యనారాయణ, రామకృష్ణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, గ్రామ అధ్యక్షుడు రాంబాబు, చెరుకుపల్లి శ్రీను, ముద్దా ముంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలు ఆరోగ్యంగా ఉంటేనే పల్లెల్లో ఆరోగ్యం

● ఎంపీడీవో ఉమాదేవి

కారంపూడి, సెప్టెంబరు 30: క్లాప్ మిత్రలు ఆరోగ్యంగా ఉంటేనే పల్లెలు ఆరోగ్యంగా ఉంటాయని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలపరిధిలోని క్లాప్ మిత్రలకు, వారి కుటుంబసభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు రమ్య వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, సీహెచ్‌వో మల్లయ్య, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

త్వరలో నూతన మద్యం పాలసీ : కలెక్టర్

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 30: నూతన మద్యం పాలసీ, మద్యం నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. సోమవారం మద్యం దుకాణాల పాలసీపై జిల్లా కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలెకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 129 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. పూర్తి వివరాలన్నీ కూడా గజిట్ వచ్చిన తరువాత వెల్లడిస్తామన్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ, లాటరీ నిర్వహించే విధానంపై కలెక్టర్‌కు వివరించారు.

విద్యాలయాల్లో జడ్జి ఆకస్మిక తనిఖీలు


వంట గదిని తనిఖీ చేస్తున్న వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి మహతి

వినుకొండ, సెప్టెంబరు 30: ఆంధ్రప్రదేశ్ లీగల్ సొసైటీ ఆదేశాల మేరకు వినుకొండ మండల లీగల్ సొసైటీ ఛైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్ మహతి ప్యానల్ న్యాయవాదులతో కలిసి విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని సెయింట్ ఆన్స్ ఉషోదయ స్పెషల్ స్కూల్, బాలుర బీసీ గురుకులు పాఠశాల, సాంఘీక సంక్షేమ బాలిక హాస్టల్, సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రతిరోజు పిల్లలకు అందిస్తున్న మెనూ, హాస్టల్స్‌లో ఇబ్బందులపై బాల బాలికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, త్రాగు నీరు అదితర అంశాలను నిశితంగా పరిలీలించి నిర్వాహకులకు పలు సూచనలు అందచేశారు. విద్యార్థులు సమయపాలన గుర్తించి బాగా చదుకోవాలని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలని. జీవితంలో మంచి ఉన్నతికి ఎదగాలంటే చదుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ ఖాన్, పి.వి రమణరెడ్డి, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంరెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

పెట్లూరివారిపాలెంలో స్వచ్ఛత హీ సేవా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30: స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్చత హీ సేవ కార్యక్రమం సోమవారం ఉప్పలపాడులో నిర్వహించారు. గ్రామంలో రోడ్లు శుభ్రపర్చటం, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రమైన జీవనశైలి, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేసినట్లు కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఎన్ఈసీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు, 30. ఇటీవల కేహెచ్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల సంకల్పం పేరుతో జాతీయ స్థాయిలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేనేజ్‌మెంట్ విద్యార్థులు షేక్ జాస్మిన్, వి.కవిత, పి.అఖిల్‌బాబు, ఎస్.రాకేష్‌లు పోటీలో పాల్గొని ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, కళాశాల వైస్‌ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పట్టాభిరాం తదితరులు విద్యార్థులను అభినందించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

పేదలకు స్థలం, పక్కా గృహాలు ఏర్పాటు చేయాలి

వినుకొండ, సెప్టెంబరు 30: దశాబ్దాల కాలంగా పూరి గుడిసెల్లో నివశిస్తున్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పరపాలెంలోని నిరుపేదలతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం నందమూరి తారక రామారావు ప్రభుత్వంలో ఎమ్మెల్యే గంగినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇచ్చిన తాటాకుల పూరిళ్లలోనే పేదలు నివశిస్తున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బూదాల శ్రీను, రాము, చీరాల అంజయ్య, తిరుమల దుర్గమ్మ, రూతమ్మ, రాహేలమ్మ, ఎద్దు ఈశ్వరమ్మ, కొండమ్మ, గోవిందమ్మ, ఎద్దు శ్రీను, గోవిందు, ప్రమీళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చందోలు నాగవాణికి గౌరవ డాక్టరేట్


అవార్డు అందుకుంటున్న చందోలు నాగవాణి

వినుకొండ, సెప్టెంబరు 30: అబ్దుల్ కలాం థెరిస్సాసేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చందోలు నాగవాణి చేస్తున్న వివిధ సేవలకు గాను గుర్రం జాషువా జయంతి వేడుకల్లో భాగంగా విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆమెను ఘనంగా సన్మానించి, డాక్టరేట్ అవార్డును అందించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 కొవిడ్ సమయంలో ప్రభుత్వ నర్సుగా ఆమె చేసిన సేవలతో పాటు, సొసైటీ ద్వారా వైద్య, విద్యా, సామాజిక, సేవా రంగాల్లో విశేష సేవకు గుర్తింపుగా అవార్డు అందినట్లు ఆమె తెలిపారు.

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

బొల్లాపల్లి, సెప్టెంబరు 30: మండలంలోని సీతారామపురం తండాకు చెందిన బాణావత్ జ్యోతి ఇటీవల అదృశ్యమైందని కుటుంబ సభ్యులు బండ్లమోటు ఎస్ఐ బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన 24గంటల్లో మిస్సింగ్ కేసును ఛేదించి సోమవారం బొల్లాపల్లి తహసీల్దార్ సుధాకర్ ఆ యువతిని హాజరు పరిచారు. అనంతరం జ్యోతి బాయి అంగీకారంతో భర్తకు అప్పగించారు. మిస్సింగ్ కేసును ఛేదించిన ఎస్ఐ బాలకృష్ణను, సిబ్బంది నాగరాజు, సురేష్, గంగిరెడ్డిలను ఉన్నతాధికారులు అభినందించారు.

రైతు సేవా కేంద్రాలలో సమృద్ధిగా ఎరువులు: ఇన్‌చార్జ్ ఏవో

శావల్యాపురం, సెప్టెంబరు 30: రైతులకు ఎరువుల కొరత లేకుండా మండలంలోని అన్ని రైతుసేవాకేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన ధరలకు రైతులకు సమృద్ధిగా ఎరువులను పంపిణీ చేస్తున్నామని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు అన్నారు. శావల్యాపురం రైతుసేవాకేంద్రంలో ఏఈవో పూరేటి అశోకతో కలసి ఆయన సోమవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, పిచికలపాలెం రైతుసేవాకేంద్రాల్లో డీఏపీ, యూరియాలు పంపిణీ చేస్తున్నామని, కనమర్లపూడి, మతుకుమల్లి, గుంటుపాలెం, కారుమంచి రైతుసేవాకేంద్రాలకు మంగళవారం డీఏపీ, యూరియా వస్తాయని, త్వరలో సొసైటీలలో కూడా డీఏపీ, యూరియా అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారం డీఏపీ రూ.1350, యూరియా రూ.266.50లకు రైతులకు అందిస్తున్నామన్నారు. ఎరువులు కావసిన రైతులు వీఏఏలను కలసి నగదును చెల్లిస్తే రెండ్రోజుల్లో ఎరువులను అందిస్తామన్నారు.

జిల్లాలో అదనపు పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ అరుణ్‌బాబు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు

నరసరావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ పీ అరుణ్‌బాబు తెలిపారు. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో 4 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ నియోజవర్గంలో 6 పోలింగ్ కేంద్రాల చిరునామాల మార్పు, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఒక అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు, 4 పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, ఒక పోలింగ్ కేంద్రం అడ్రస్ మార్పులకు సంబంధించి ప్రతిపాదనలను తెలిపారు. నిబంధనల మేరకు జిల్లాలో 1500కు పైబడి ఓట్లున్న పోలింగ్ కేంద్రానికి అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు విషయంలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేరు వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై అక్టోబరు 3 నాటికి రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సహేతుక కారణాలతో సహా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీవోలు మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, ఈఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ అరుణబాబు, జేసీ సూరజ్, జిల్లా డీఆర్వో వినాయకంలతో కలిసి 101 వినతులు స్వీకరించారు.

ఇంటిని కూల్చిన వారిని అరెస్టు చేయాలని ధర్నా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30: చిలకలూరిపేట మండలం యడవల్లి ఎస్టీ కాలనీలోని ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని కూల్చిన తన్నీరు


కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు, బాధిత కుటుంబ సభ్యులు

గోవిందరాజు, అతని బంధువులను అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రెండు రోజులుగా కలెక్టర్, ఎస్పీలను కలవనీయకుండా గ్రామంలో నిర్బంధించి, స్టేషన్‌కు తరలించి బలవంతంగా సంతకాలు తీసుకున్న డీఎస్పీ చట్ట వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధర్నాలో కులనిర్మూలన పోరాట సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి కే నాగేశ్వరరావు, సీహెచ్ రాజశేఖర్, కొయ్యలమూడి జయమ్మ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బీ కొండారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 30: పింఛన్ల పంపిణీ అక్టోబరు ఒకటిన సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారులతో పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. పింఛన్ల పంపిణీ ఉదయం 10గంటల లోపు పూర్తి చేయాలని, సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో కంట్రోల్ రూమ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

వేతనాలు స్వాహా చేశారని ఉపాధి కూలీల ఫిర్యాదు

మతుకుమల్లి (శావల్యాపురం) సెప్టెంబరు 30: ఉపాధి వేతనాలు స్వాహా చేశారంటూ శావల్యాపురం మండలం మతుకుమల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబును కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఉపాధి కూలీలు మాట్లాడుతూ తాగునీటి పథకం వద్ద అభివృద్ధి పనులు చేయించుకొని వేతనాలు చెల్లించకుండా గ్రామ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్, అధికారులు కుమ్మక్కై పంచాయతీ ఖాతా నుంచి నగదు స్వాహా చేశారన్నారు. 2023లో ఫీల్డ్ అసిస్టెంట్ ఆదేశాలతో గ్రామంలోని తాగునీటి పథకం వద్ద ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేశామన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ మాలో కొందరికి మాత్రమే వేతనాలు చెల్లించి మిగిలినవారికి ప్రభుత్వం ఇంకా చెల్లించలేదంటూ ఏడాదిగా కాలయాపన చేస్తున్నాడని వాపోయారు. ఇదే విషయాన్ని డ్వామాపీడీ జోసఫ్‌కుమార్‌కు విన్నవించామని అయినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కుల చట్టంద్వారా తాగునీటి పథకం వద్ద జరిగిన అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శిని సమాచారం కోరగా ఉపాధి కూలీలు చేసిన పనికి సంబంధించిన వేతనాలను పంచాయతీ ఖాతా నుంచి డ్రా చేసినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య, గన్నవరపు రామలక్ష్మి, ఉప్పలపాటి అన్నపూర్ణమ్మ, ముండ్రు కుమారి, వీరగంధం పిచ్చమ్మ, భీమని వెంకట్రావు, పాపసాని వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 30: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీర దృఢత్వానికి ఎంతో దోహదపడతామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక లయోలా పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్ ఆటల పోటీల బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను, క్రీడలను ఎన్డీఏ ప్రభుత్వం పోత్సహిస్తుందని తెలిపారు.

ఆడదాం ఆంధ్ర పేరుతో రూ.80 కోట్లు అవినీతి

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో క్రీడాకారులకు తీరని అన్యాయం చేసిందని, ఆడుదాం ఆంధ్ర పేరుతో రూ.100 కోట్లు కేటాయించి రూ.80 కోట్లు దోచుకుందని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క జిల్లా కేంద్రంలో నైనా స్టేడియం నిర్మించిన దాఖలాలు లేదన్నారు. దుర్మార్గపు పాలన గ్రహించిన ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపారన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఆటస్థలాల అభివృద్ధికి రూ.5లక్షలు అందచేస్తుందన్నారు. అనంతరం బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన విశాఖపట్నం, రన్నర్‌గా నిలిచిన అనంతపురం, బాలికల విభాగంలో విన్నర్‌గా నిలిచిన వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు, రన్నర్‌గా నిలిచిన అనంతపురం జిల్లా జట్లకు బహుమతులు అందజేశారు. ఆదేవిధంగా బాలుర బెస్ట్ ప్రైజ్ విభాగంలో మంచి క్రీడాకారుడుగా ఎస్‌డీ అలీ (గుంటూరు), స్కోరర్‌గా బి.సాయి (విశాఖపట్నం), గోల్డు కీపర్‌గా విష్ణువర్ధన్ (చిత్తూరు). బాలికల విభాగంలో గోల్డు కీపర్ ఆర్ భువన (కడప), బెస్ట్ స్కోరర్‌గా టి.మహి (గుంటూరు), బెస్ట్ ప్లేయర్‌గా ఎ.వర్షలను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సెక్రటరీ సురేష్, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను. పీడీలు ఎలమంద, చిరంజీవి , రాధాకృష్ణ, డాక్టర్ వీరాంజనేయులు, లయోలా ఫాదర్ జ్ఞానదేవన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఫాదర్. రవి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేష్, కొండలు, సుబ్బారావు, శ్రీనివాసరావు, అంజినాయక్, అమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలోకి పాములు

క్రీడలు జరుగుతున్న సమయంలో పాములు రావటంతో క్రీడాకారులు భయాందళనలకు గురయ్యారు. రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ బాలికల ఫైనల్ మ్యాచ్ జరుగున్న సందర్భంలో ఒక్కసారి మూడు పాములు క్రీడా ప్రాంగనంలో కనిపించడంతో క్రీడాకారులు బెదిరిపోయారు. ఫైనల్ మ్యాచ్‌లో కడప, అనంతపురం జిల్లాలకు చెందిన ఫుట్‌బాల్ ఆటలో పాములు చూసి కొందరు కేకలు వేశారు. స్థానికులు స్పందించి రెండు పాములను చంపివేయగా, ఒకటి తప్పించుకుంది. పాముల గందరగోళంతో మ్యాచ్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. అనంతరం బాలికలు ఆటను ప్రారంభించారు.

స్వచ్ఛతకు అందరూ సహకరించాలి: కమిషనర్

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 30: నరసరావుపేట పరిశుభ్రతకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, శానిటేషన్ మేస్త్రీలకు స్థానిక మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లాలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క సెక్రటరీ తమ వార్డు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకునేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యాపారులు షాపులలో వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లకు అందించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య పి.రమాదేవి పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

బొల్లాపల్లి, సెప్టెంబరు 30: మండలంలోని మూగచింతలపాలెంలోని అంగన్‌వాడీ స్కూల్ విద్యార్థులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి సంఘం తరుపున అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ప్లేట్లు, గాసులు, కుర్చీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలతో పాటు భవిష్యత్‌లో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రావూరి నారాయణ, బొడ్డపాటి యలమంద, గర్నెపూడి ఈశ్వరయ్య, గుంజరి పున్నయ్య, కట్టెపూడి భర్న, సీతారామయ్య, కోటేశ్వరరావు, నాగయ్య, వెంకట కోటయ్య, బాబు, పవన్, మరియబాబు, నాసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పీవీ సురేష్‌కు సత్కారం

వినుకొండ, సెప్టెంబరు 30: పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందిన పి.వి సురేష్‌ను వైద్యశాల సిబ్బంది సోమవారం అభినందించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రతినెల 9 తేదీన ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు సహకారంలో గర్భిణులకు మానవ సేవ సమితి ద్వారా భోజన సదుపాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పర్వీన్, వైద్యశాల పరిధిలోని వార్డు సెక్రటరీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వార్డులను అభివృద్ధి చేసుకుందాం: ఛైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట, సెప్టెంబరు 30: స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసుకుందాం అని మున్సిపల్ ఛైర్మన్ సోమవారం అన్నారు. చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ శాసనసభ్యుడు ప్రతిపాటి పుల్లారావు త్వరలో మునిసిపాలిటీకి వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయించనున్నారన్నారు. కౌన్సిలర్లు కూనల ప్రమీల, కొత్తకుమారి, శివకుమారి, ఈసుఫ్ అలీ, బిట్రా రాజేంద్ర కోరారు. కోతులు, కుక్కల బెడదను కౌన్సిలర్లు ప్రస్తావించారు.

కోటప్పకొండలో మహానందికి ప్రదోష అభిషేకం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 30: త్రికూటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భాద్రపద మాస బహుళ త్రయోదశి సందర్భంగా మహానందీశ్వర స్వామి వారికి పంచామృతాలతో, విశేష ద్రవ్యాలతో మాసోత్సవంగా ప్రదోష అభిషేకం సోమవారం సాయంత్రం ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. మహానందీశ్వరస్వామికి నిర్వహించిన ప్రదోష అభిషేకాలను ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అభిషేకాలను తిలకించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, సెప్టెంబరు 30: మండలంలోని రొంపిచర్లలోని బాలా త్రిపుర సుందరి సమేత శంకరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకలు జరిగాయి. శంకరస్వామి, పార్వతీదేవి, విఘ్నేశ్వరునికి పూజలను నిర్వహించారు. అర్చకులు పేటేటి వేములబాబు శర్మ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఏపీ మోడల్ పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ

రొంపిచర్ల, సెప్టెంబరు 30: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల గదులను శుభ్రపరిచి పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి చెట్లను తొలగించి పరిసరాలను శుభ్రంచేశారు. మొక్కలకు పాదులు చేసి నీరందించారు. అవి ఎదగటానికి ఏర్పాట్లు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవటం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాక హానికర జీవులు రాకుండా ఉంటాయని ప్రిన్సిపల్ రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: ఎంపీటీసీ

లింగారావుపాలెం (యడ్లపాడు), సెప్టెంబరు 30: మన ఇంటిని శుభ్రం చేసుకుంటే చాలదు.. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీటీసీ తోకల వీరరాఘవయ్య అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరువారి సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వభావ స్వచ్ఛత.. సంస్కార స్వచ్ఛతలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ అందుకు కృషిచేయాలని కోరారు. హెచ్ఎం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా భావితరాలకు మెరుగైన సమాజాన్ని అందించవచ్చన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిబ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ కో-ఆప్షన్ సభ్యులు నంబూరు శివరామకృష్ణయ్య, జనచైతన్య సమితి నిర్వాహకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శివారెడ్డి తదితరులను విచారిస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

అక్రమ వసూళ్లపై పంచాయతీ అధికారి విచారణ

ఎఫెక్ట్

నాదెండ్ల, సెప్టెంబరు 30: గడిచిన ఐదు సంవత్సరాలుగా చిరుమామిళ్ళలో వైసీపీ నాయకులు రక్షిత తాగునీటి పథకాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా చేసిన వసూళ్ళపై పల్నాడు జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు. వైసీపీ నేతల జేబుల్లోకి జనం సొమ్ము అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి ఆదేశాల మేరకు గ్రామానికి వచ్చిన విజయ భాస్కర్ రెడ్డి మూడు గంటల పాటు విచారణ జరిపారు. 2019లో సింగారెడ్డి కోటిరెడ్డి ఆయన కుమారుడు వాటర్ ప్లాంట్‌తో పాటు నీటి పథకాన్ని దౌర్జన్యంగా తాళాలు పగల గొట్టి స్వాధీనం చేసుకున్నారని గాదె శివారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులకు, పంచాయతీ అధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాజన్న రక్షిత నీటి పథకం పేరుతో చేసిన రుసుం వసూలుపై డీపీవోను ప్రశ్నించగా తాము ఎవ్వరి వద్ద రూపాయి తీసుకోలేదని, ఆ వసూళ్ళతో తమకు సంబంధం లేదని సింగారెడ్డి కోటిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన భవనం శ్రీనివాసరెడ్డి, నీటి పథకంకు సంబంధించి పలు విషయాలను, ఆధారాలను డీపీవోకు చూపించారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రసాదు తమ శాఖకు పంచాయతీ వారు రూ 18.70 లక్షలకు పైగా విద్యుత్ బకాయి ఉందని లిఖిత పూర్వకంగా విన్నవించారు. గ్రామానికి చెందిన నాగిరెడ్డి, శ్యామలా కోటిరెడ్డి, హరికృష్ణ, కార్యదర్శి స్వాతి తదితరులను డీపీవో విచారించారు. పంచాయతీకి సంబంధించి రికార్డులు, తీర్మానాల వివరాలు అందజేయాలని కార్యదర్శికి సూచించారు. ఈ విషయమై విచారణ మరోమారు జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావులు విచారణలో పాల్గొన్నారు.

వర్గపోరుతో నీటి సరఫరా నిలిపివేత

నాదెండ్ల, సెప్టెంబరు 30: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో వర్గ పోరుతో మూడు రోజులుగా రక్షిత నీటి పథకం తాగునీటి సరఫరాను ఒక వర్గం వారు నిలిపివేశారు. గ్రామంలో వర్గపోరులో భాగంగా సురక్షిత తాగునీటి పథకానికి తాళాలు వేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా మూడు రోజుల క్రితం ఎస్ఐ పుల్లారావు గ్రామానికి వచ్చి వాటర్ ప్లాంట్ తాళాలు తీయించారు. ఈ క్రమంలో మరో వర్గం వారు తాళాలు తీయటానికి వీల్లేదన్నారు. పెద్దల సమక్షంలోనే సమస్య పరిష్కారం కావాలని కోరారు. దీంతో వాటర్ ప్లాంట్‌కు మళ్ళీ తాళం వేశారు. ఈ క్రమంలో రక్షిత నీటి పథకం నిర్వహిస్తున్న మరోవర్గం వారు వాటర్‌ప్లాంట్ విషయం తేలేవరకు నీటి సరఫరా చేయమన్నారు. గడిచిన మూడు రోజులుగా నీటి సరఫరా లేక చిరుమామిళ్ళ గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

పట్టభద్రుల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 30: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల నియోజక వర్గానికి జరగనున్న శాసన మండలి ఎన్నికల ప్రక్రియకు చిలకలూరిపేట నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శ్రీకారం చుట్టారు. కూటమి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును ఎంపిక చేసిన నేపథ్యంలో వారి ప్రతినిధులుగా చిలకలూరిపేట నియోజకవర్గానికి పాలడుగు సురేంద్ర, పాలడుగు ప్రణీత్‌లను నియమించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వలస కార్మికుడి మృతి

యడ్లపాడు, సెప్టెంబరు 30: ఉన్నవ సాయిబాలాజీ నూలు మిల్లులో పనిచేసే ఒడిషా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు అనారోగ్యంతో మృతిచెందినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సాయిబాలాజీ నూలు మిల్లులో ఒడిషా రాష్ట్రానికి చెందిన అన్నంజన (27) ఆదివారం మధ్యాహ్నం మిల్లులోని నివాసం నుంచి బయటకు వస్తూ ప్రాంగణంలో కుప్పకూలాడు. అతనిని మిల్లు యాజమాన్యం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అన్నంజన మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుని తండ్రి సురేంద్రజన ఫిర్యాదుమేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

బాస్కెట్ బాల్ జట్టుకు వంకాయలపాడు విద్యార్థుల ఎంపిక


బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రవి, పీఈటీ శ్రీనివాసరావు

యడ్లపాడు, సెప్టెంబరు 30: ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ జట్టుకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు మండలంలోని వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి తెలిపారు. నరసరావుపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలికల జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు సోమవారం జరిగాయన్నారు. పాఠశాల తరపున అండర్-17 విభాగంలో పాల్గొన్న తొమ్మిదో తరగతి చదువుతున్న పి.నాగవైష్ణవి, అండర్-14 బాలికల విభాగంలో బి హంసికలు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అక్టోబరు 17, 18, 19 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగే అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున నాగవైష్ణవి ప్రాతినిధ్యం వహించనుందన్నారు. అలాగే అక్టోబరు చివరలో వినుకొండలో జరిగే అండర్-14 విభాగంలో బి.హంసిక జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం రవితోపాటు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాముడు తదితరులు అభినందించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి: డీసీఏవో

యడ్లపాడు, సెప్టెంబరు 30: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారా రుణాలు తీసుకున్న సంఘ సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘాల పురోగతికి సహకరించాలని జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి (డీసీఏవో) డి శ్రీనివాసరావు కోరారు. యడ్లపాడు పీఏసీఎస్ ప్రాంగణంలో సొసైటీ సభ్యుల మహాజనసభ సోమవారం జరిగింది. ముందుగా సొసైటీ సీఈవో జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ ఆవిర్భావం, అందిస్తున్న రుణాలు, ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాలు, వసూళ్ళు తదితర అంశాలను సభ్యులకు తెలియచేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన డీసీఏవో మాట్లాడుతూ యడ్లపాడు పీఏసీఎస్ మంజూరు చేసిన రుణాలు రూ.45 కోట్లు కాగా కాల పరిమితి ముగిసినప్పటికీ వసూలుకాని రుణాలు రూ.5కోట్లు ఉన్నాయన్నారు. దీంతో కొత్తగా రుణాలు మంజూరు చేసే విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. చిలకలూరిపేట జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ సభ్యులు సొసైటీ ద్వారా కల్పించే బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్సన్ ఇన్‌చార్జి పి.పెబి మాట్లాడుతూ సొసైటీలో రూ.300 అంతకంటే ఎక్కువ షేరు ధనం కలిగిన పూర్వ సభ్యులు ఓటుహక్కును పునరుద్ధరించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు మద్దినేని సుబ్బారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.